17న ప్రసాద్ ఐమాక్స్ వద్ద నుక్కడ్ నాటక్

కాచిగూడ: కాచిగూడ లోని బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ దియేట్రిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు ఖైరతాబాద్‌లోని ప్రసాద్ ఐమాక్స్ వద్ద రైట్ టు ఓట్ అనే అంశంపై నుక్కడ్ నాటక్ ప్రదర్శనతో పాటు ఫ్లాష్ మాబ్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఇన్‌చార్జి సంధ్య తెలిపారు. ఓటు హక్కుపైన ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

సన్మానం



చిక్కడపల్లి: నారాయణగూడ వైఎంసీఏ వద్ద జరిగిన సదర్ ఉత్సవంలో బీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్‌ను తెలంగాణ యాదవ సేన , నేతలు నీలం శ్రీనివాస్‌యాదవ్, పెండెం శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్‌యాదవ్ సన్మానించారు.

20 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోంది



ఎన్నికల ప్రచారంలో గోల్నాకలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట్: 20రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతోందని అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తే ఆరు గ్యారంటీలను అమలు చేసి పేద ప్రజల అభ్యున్నతికి పాటు పడతామని అన్నారు. బుధవారం గోల్నాక డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా లాల్‌బాగ్, వీరన్నగుట్ట, అన్నపూర్ణనగర్ తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి ఈ ఒక్కసారి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తనను గెలిపిస్తే మీలో ఒకడిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలువురు మైనార్టీలు ఈ సందర్భంగా కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకులు పులిజగన్, రాంమ్మోహన్, ఫరిద్ పాల్గొన్నారు.

తనయుడి కోసం తండ్రి ఎన్నికల ప్రచారం

నల్లకుంట: నియోజక వర్గం కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్ రెడ్డికి మద్దతుగా ఆయన తండ్రి డాక్టర్ ముత్యం రెడ్డి బుధవారం పాత నల్లకుంటలో ఎన్నికల ప్రచారం చేశారు. ఉదయం పాత నల్లకుంట డాక్టర్ ఛారీలేన్, పాత రామాలయం లేన్ ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లిన ఆయన ఓటర్లను, ముఖ్యంగా సీనియర్ సిటీజన్స్ కలిసి కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోని ఆరు గ్యారంటీలను వివరించారు. హస్తం గుర్తుపై ఓటేసి తన కుమారుడు రోహిన్ రెడ్డిని గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కె.గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకుడు చింతల ధనార్జున్ రెడ్డి పాల్గొన్నారు.



పాత నల్లకుంటలో కాంగ్రెస్ అభ్యర్థి రోహిన్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ ముత్యం రెడ్డి

అంబర్‌పేట బరిలో 20 మంది

అంబర్‌పేట: నియోజకవర్గంలో నామినేషన్ల గడువు ముగిసినప్పటికీ అభ్యర్థులెవరూ నామినేషన్లను ఉపసంహరించుకోలేదు. నామినేషన్ల పరిశీలన అనంతరం 20 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఈనెల 13న ఆర్ఓ ప్రకటించారు. కాగా బుధవారం నామినేషన్ల ఉపసంహరణ చివరి గడువు ఉండడంతో అధికార యంత్రాంగం మధ్యాహ్నం 3 గంటల వరకు వేచి చూశారు. ఒక్కరు కూడా నామినేషన్లు ఉపసంహరించుకోలేదు. దీంతో అంబర్‌పేట బరిలో 20మంది ఉండనున్నట్లు తేలింది. ఇందులో 14 మంది స్వతంత్ర్య అభ్యర్థులు కాగా 6 మంది ప్రధాన పార్టీలతో పాటు ఇతర పార్టీలకు చెందిన నేతలు ఉన్నారు.

ముషీరాబాద్ బరిలో 31 మంది

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల బరిలో 35 మంది నామినేషన్లు వేయగా ఈ నెల 13న జరిగిన నామినేషన్ల పరిశీలనలో ఎన్నికల నియామవలి పాటించని ఇద్దరి అభ్యర్థుల నామినేషన్లు తిరస్కరించినట్లు ముషీరాబాద్ రిటర్నింగ్ అధికారి వి. లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణలో ఇద్దరు స్వాతంత్ర్య అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో ముషీరాబాద్ ఎన్నికల బరిలో 31 మంది నిలిచారు.

ప్రజావసరాలు తీర్చే పార్టీ బీఆర్ఎస్



దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: ప్రజల అవసరాలను అడగకుండానే తీర్చే ముఖ్యమంత్రి మన కేసీఆర్ అని అందుకు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్ కోరారు. మంగళవారం 6 నంబరు చౌరస్తాలో జరిగిన దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరై మాట్లాడారు. దివ్యాంగుల ఇబ్బందులను గుర్తించిన సీఎం కేసీఆర్ 4వేల పింఛన్ ప్రకటించి అమలు చేశారన్నారు. తిరిగి ఈ ఎన్నికల్లో దివ్యాంగులు అంతా కలిసి బీఆర్ఎస్‌కు ఓటేస్తే దానికి రూ.6వేలు చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు తుడుం రాజేందర్, డి.మల్లికార్జున్, మంద భిక్షపతి యాదవ్, వెంకటేశ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి



బాగ్‌లింగంపల్లిలో ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఘనంగా సత్కరిస్తున్న స్థానిక ప్రజలు పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశానని నేను చేసిన అభివృద్ధికి పట్టంకట్టాలంటే మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ విజ్ఞప్తి చేశారు. బుధవారం రాంనగర్ డివిజన్ బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీ, ఎంఐజీ, లంబాడి తాండా, భగత్‌సింగ్‌నగర్ తదితర ప్రాంతాలలో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు పది కోట్ల నిధులు ఖర్చు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేకంగా నియోజకవర్గంలోని అన్ని పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు వీఎస్‌టీ నుంచి ట్యాంక్‌బండ్ వరకు స్టీల్ బ్రిడ్జి ఫ్లైఓవర్‌ను నిర్మించామని చెప్పారు. ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలు మరిన్ని చేపట్టడానికి మరోసారి అవకాశం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా కాంగ్రెస్, బీజేపీల కంటే ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉంది. ఎమ్మెల్యే ముఠా గోపాల్ నియోజకవర్గంలోని వాడవాడలు గల్లీ, గల్లీలు తిరుగుతూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. కార్యక్రమంలో యువజన నాయకులు ముఠా జైసింహ, డివిజన్ అధ్యక్షులు ఆర్.మోజెస్, ప్రధాన కార్యదర్శి ఎం.దామోదర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బబ్లూ, పి.రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఏ.కిషన్ రావు, నాగభూషణం, ఆర్.వివేక్, పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విస్తృతంగా ప్రచారం చేశారు.ఈ సందర్భంగా పలు బస్తీలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు.

బీఆర్ఎస్‌కు క్రైస్తవ సంఘాల మద్దతు..



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు మద్దతు తెలుపుతున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీఆర్ఎస్ అభ్యర్థి ముఠా గోపాల్‌కు పలు క్రైస్తవ సంఘాలు బుధవారం మద్దతు తెలిపాయి. వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని 50కిపైగా ఉన్న సంఘాలతో సమావేశం జరిగింది. ముఠా గోపాల్‌ను రెండవసారి గెలిపించుకోవాలని క్రైస్తవ సంఘాల పెద్దలు సాల్మన్‌రాజ్, బెంజిమెన్, బ్రదర్ కేస్, డేవిడ్, సుదేష్, సామ్ అబ్రహం తదితరులు క్రైస్తవులను కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో అన్ని కులాలు, మతాలకు సమాన అవకాశాలు కల్పిస్తు అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావుల పాటి మోజెస్, ప్రధాన కార్యదర్శి మణ్నెదామోదర్ రెడ్డి, పాస్టర్లు రవిసుందర్, ప్రతాప్ పాల్గొన్నారు.

18న ఉచిత కంటి వైద్యశిబిరం

చిక్కడపల్లి: గాంధీనగర్ కెనరాబ్యాంక్‌వద్దనున్న ఆద్య ఐ కేర్‌లో ఈ నెల ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఆర్.పల్లవిగుప్తారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలనుంచి సాయంత్రం 6 గంటలవరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు.

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

చిక్కడపల్లి: రెండేళ్ళనుంచి పెండింగ్‌లో ఉన్న ప్రజల రోడ్డు సమస్యను మోక్షం లభించింది గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని పరిధిలోని గాంధీనగర్ నర్మదానర్సింగ్‌హోమ్ సమీపంలో గల మాధవరావు లేన్‌లో నూతన వీడీసీసీ రోడ్డు నిర్మాణం పనులను బుధవారం డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ స్థానిక కాలనీవాసులతో కలసి పర్యవేక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌తో పేర్కొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ పెద్ద పీట

ముషీరాబాద్: మైనార్టీలు అన్ని రంగాలలో రాణించే విధంగా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని బీఆర్ఎస్ యువజన కమిటీ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. బుధవారం భోలక్‌పూర్‌లో బంగ్లాదేశ్, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు జునేద్‌బాగ్దాదీ ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు, వ్యాపారులు, మైనార్టీలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ముఠా జైసింహ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.

హత్యా రాజకీయాలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: సిర్పూర్ నుంచి పోటీ చేస్తున్న బీఎస్పీ అధినేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై హత్యారాజకీయాలు తగవని బహుజన జేఏసీ, ఓయూ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ప్రవీణ్‌కుమార్‌పై జరిగిన దాడికి నిరసనగా బుధవారం ఓయూలో ర్యాలీ చేపట్టారు. అనంతరం జేఏసీ నేత వేల్పుల సంజయ్ మాట్లాడుతూ.. సిర్పూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనప్ప నీచ రాజకీయాలకు తెగబడుతున్నారని ఎన్నికల్లో ఓడిపోతున్నామని తెలిసి బీఆర్ఎస్ నేతలు దాడులకు పాల్పడతున్నారని ఆరోపించారు. దాడికి ఉసిగొల్పిన ఎమ్మెల్యే కోనప్పను అరెస్ట్ చేయాలన్నారు.

కులగణన చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణలో కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. బిహార్ తరహా అన్ని రాష్ట్రాలలో కులగణన చేపట్టాలన్నారు. ఏపీలో బీసీ కులగణన చేయడం పట్ల ఆ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు.

భక్తి శ్రద్ధలతో కోటి దీపోత్సవం





కవాడిగూడ: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని భక్తి టీవీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో రెండోవరోజు కోటి దీపోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్గొండ నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా కాణిపాకం శ్రీ. వరసిద్ది వినాయక స్వామి కళ్యాణ మహోత్సవం, మోపిదేవి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా వేద పండితుల మంత్రోత్సావాలతో నిర్వహించారు. ఘనంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవమూర్తులను మూషిక వాహనంపై, శ్రీమోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ మూర్తులను మయూరవహానంపై ఎన్టీఆర్ స్టేడియం నలుమూలల భక్తుల దర్శనార్థం ఊరేగించారు.



తూనికల కొలతల శాఖ అధికారులకు వినతిపత్రం



చిక్కడపల్లి: తూనికలు కొలతలు చట్టాన్ని ఉల్లంఘించిన వారికి జరిమానా విధించే సవరణలపై వినియోగదారుల సంఘాలు, వ్యాపార ప్రతినిధులు అభిప్రాయాల సేకరణకు లీగల్ మెట్రాలాజీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారుల సంఘాల జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. గోల్కొండ చౌరస్తాలోని తూనికలు, కొలతల రాష్ట్ర కంట్రోలర్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటి కంట్రోలర్ సిద్ధార్థకుమార్‌కు సాంబరాజు చక్రపాణి సంస్థ సభ్యులు హరిబాబు, శంకర్ లాల్‌లు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సాంబరాజు చక్రపాణి మాట్లాడుతూ చట్టంలోని సెక్షన్లు 25, 27, 28, 31, 34, 36లలో జైలు శిక్ష లేకుండా భారీ జరిమానా విధించే సవరణలున్నాయన్నారు. వీటిపై వినియోగదారుల సంఘాలు, వ్యాపార ప్రతినిధుల అభిప్రాయాల సేకరణకు లీగల్ మెట్రాలజీ తేదీని తుది గడువుగా నిర్ణయించినందున సత్వరమే వినియోగదారుల రక్షణ దృష్యా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

అంజన్‌కుమార్

చిక్కడపల్లి: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ అభ్యర్థి ఎం. అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి దేవాలయం లేన్, అశోక్‌నగర్ చమన్, పీపుల్స్‌హైస్కూల్, అశోక్‌నగర్ బ్రిడ్జి ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు అంజన్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో పేదలకు వరంలాంటిదని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఖచ్చితంగా అమలు చేస్తామని తెలిపారు. గడపగడపకు ఆరు గ్యారంటీ పథకాలతో నిరుపేదలకు మేలు అన్నారు. రాబోయే ఎన్నికల్లో తనను గెలిపిస్తే ముషీరాబాద్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం శంకర్, చంద్రకళ, అభిషేక్‌కెన్నడీ, సురేందర్ పాల్గొన్నారు



ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్

బీఆర్ఎస్‌లో చేరిక



కాచిగూడ: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితుడినై రాష్ట్ర మంత్రి టి.హరీష్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ టి.రాజ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ మంత్రి హరీశ్ రావు నేతృత్వంలో సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు నీరడి భూపేష్ సాగర్, సందీప్ రెడ్డి, విజయేందర్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

సెక్యులర్ పార్టీ బీఆర్ఎస్‌కే మద్దతు

ముషీరాబాద్: సెక్యులర్ పార్టీ అయిన బీఆర్ఎస్‌కే ముస్లింలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సీనియర్ నాయకులు సయ్యద్ షకీల్ అన్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం భోలక్‌పూర్ బీఆర్ఎస్ ఎన్నికల పార్టీ కార్యాలయంలో ఉర్దూలో ముద్రించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం సయ్యద్ షకీల్ మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం అంకిత భావంతో కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాధిక్, సయ్యద్ ఉమర్, అబ్దుల్ ఆలీమ్, శంకర్‌గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం

కవాడిగూడ: బీజేపీతోనే అవినీతి పాలన వ్యవస్థ సాధ్యమని రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. బుధవారం కవాడిగూడ డివిజన్ పరిధిలోని దోమలగూడ, జ్యోతినగర్, రత్నాల మైసమ్మ దేవాలయం, దేవి ప్రసాద్‌బాగ్, అడ్వకేట్స్ కాలనీ, సూరజ్‌నగర్, ఎంసీహెచ్ క్వార్టర్స్, వినాయకనగర్, మైసమ్మ బండ తదితర బస్తీలలో డివిజన్ బీజేపీ అధ్యక్షులు మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ముషీరాబాద్ బీజేపీ అభ్యర్థి పూసరాజుతో కలిసి పాదయాత్ర చేపట్టారు. బీఆర్ఎస్ గెలుపు ఆ పార్టీ నాయకులకు కలగానే మిగిలిపోతుందన్నారు. ముషీరాబాద్‌లో బీజేపీ పార్టీ విజయ కేతనం ఎగురవేస్తుందన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

లాలాపేట: తార్నాక దళిత క్రిస్టియన్ పొలిటికల్ కమిటీ ఆర్గనైజేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, లాలాగూడ తదితర ప్రాంతాలకు చెందిన దళిత క్రైస్తవులు ఈ ఆర్గనైజేషన్‌లో సభ్యులుగా ఉన్నారు. అధ్యక్షుడిగా బండ అబ్రహం, ఉపాధ్యక్షుడిగా కె జె జయకర్, జె.శాంసన్, ప్రధాన కార్యదర్శిగా గంధమల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా జి. జాన్‌బాబు, పీడి అజరయ్య మోజెస్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా బండ అనంద్, కోశాధికారిగా విద్యాసాగర్, సలహాదారుగా బాస్కుల కొమురయ్య ఎన్నికయ్యారు.

బౌద్ధనగర్‌లో అగ్ని ప్రమాదం

బౌద్ధనగర్: సంజయ్ గాంధీ నగర్‌లోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్, కేబుల్, ఇంటర్నెట్ తీగలన్నీ దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

క్యాబ్ డ్రైవర్ల సమ్మె

బంజారాహిల్స్: ఓలా, ఉబర్ సంస్థలు తమకు సరైన కమీషన్లు ఇవ్వడం లేదని, ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ క్యాబ్ డ్రైవర్లు సమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో డ్రైవర్లు ఓలా, ఉబర్ క్యాబ్‌లను నిలిపివేసి నిరసన తెలిపారు. తమ కష్టాన్ని సదరు కంపెనీలు దోచుకుంటున్నాయని ఆయా కంపెనీలు ఇచ్చే డబ్బులు డీజిల్, కారు రిపేర్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగుతుందని హెచ్చరించారు.

సదర్ వేడుకల్లో దొంగల చేతివాటం

హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వైఎంసీఏ చౌరస్తాలో మంగళవారం రాత్రి జరిగిన సదర్ ఉత్సవాల్లో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. డీఐ నాగార్జున కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. నారాయణగూడలో సదర్ ఉత్సవాలను చూసేందుకు ప్రజ లు పెద్దఎత్తున తరలివచ్చారు. దీనిని అదనుగా తీసుకుని కొందరు యువకులు ఐదు సెల్‌ఫోన్లు కాజేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ నాగార్జున తెలిపారు.

చెత్తకు నిప్పు.. పర్యావరణానికి ముప్పు

గడువు ముగిసిన మందుల కాల్చివేతకు ఫీవర్‌లో ఏర్పాట్లు శూన్యం



ఫీవర్ ఆస్పత్రిలో ఫార్మసీ బిల్డింగ్ వెనుక భాగంలో గడువు ముగిసిన మందులను కాల్చివేస్తున్న దృశ్యం

నల్లకుంట: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని ఓ పక్క ప్రభుత్వం విస్తృతంగా ప్రచారం చేస్తుండగా మరో పక్క కొందరు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా చేస్తున్న మందులు కొన్ని సమయాల్లో ఎక్స్‌పైరీ డేట్(గడువు తేదీ) ముగిసిపోయిన తరువాత వాటిని ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. గడువు ముగిసిన మందులను బహిరంగ ప్రదేశాలలో పడేయరాదు. వాటిని కాల్చివేయడానికి వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలి. కాని నగరంలోని ఏ ఆసుపత్రిలోనూ అలాంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో చాలా ఆసుపత్రుల్లో విధిలేని పరిస్థితుల్లో గడువు ముగిసిన మందులను ఒక చోట కుప్పగా పోసి చెత్త కప్పి నిప్పంటిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో పొగలు కమ్ముకుంటున్నాయి. ఇటీవల కోవిడ్ తగ్గు ముఖం పట్టాక డెంగ్యూ వ్యాధి తీవ్ర రూపం దాల్చడంతో చికిత్స కోసం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి క్యూకట్టారు. దీంతో మందుల కొరతలేకుండా అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. అలాగే కోవిడ్ కొత్త వేరియంట్స్ నేపథ్యంలో వాటికి సంబంధించిన మందులను కూడా అందుబాటులో ఉంచారు. ఈ క్రమంలో రెండు వ్యాధుల తీవ్రత తగ్గు ముఖం పట్టడంతో చాలా వరకు మందుల వినియోగం తగ్గింది. కాగా ఈ వ్యాధులకు సంబంధించిన మందులతో పాటు ఇతర మందుల్లో కొన్నింటి గడువు ముగిసిపోయాయి. దీంతో గడువు ముగిసిన మందులను ఆయా కంపెనీలకు రిటర్న్ చేయాలంటే సాధ్యమయ్యే పనికాదు.. అలాగని వాటిని ఫార్మసీలో స్టోర్ చేయలేరు. పైగా గడువు ముగిసిన మందులను కాల్చివేసేందుకు ప్రత్యేకంగా ఆసుపత్రిలో ఏర్పాట్లు లేవు. దీంతో విధిలేని పరిస్థితుల్లో గడువు ముగిసన మందులను ఆసుపత్రి ఫార్మసీ బిల్డింగ్ వెనుక ఉన్న ఖాళీ ప్రదేశంలో ఓ చోట కాల్చివేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు కమ్మేస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గడువు ముగిసిన మందులను కాల్చివేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.

ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

అడ్డగుట్ట: రాష్ట్రంలో ఫాసిస్టు పాలనను కొనసాగిస్తున్న బీజేపీ, బీఆర్ఎస్ ఇతర పార్టీలను ఓడించాల్సిన అవసరం ఉందని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల కన్వీనర్ ముత్తయ్య పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం లాలాగూడ రైల్వే క్యారేజ్ వర్క్‌షాప్ ఆవరణలో కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో భారత రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలకు మేలు చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. గెలిచిన ప్రభుత్వాన్ని నిరంతరం ప్రజలు ప్రశ్నించాలని, ప్రజా, ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రభుత్వాలను ఓడించాలని కోరారు.



బీఆర్ఎస్ కోవర్టుగా ఏసీపీ యాదగిరి

- రెండు రోజులుగా నా ప్రచారానికి అనుమతులు నిరాకరిస్తున్నారు
- నా నామినేషన్‌ను డిస్ క్వాలిఫై చేసేందుకు ప్రయత్నిస్తున్నారు
- కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: చిక్కడపల్లి ఏసీపీ, ముషీరాబాద్ నోడల్ అధికారి యాదగిరి అధికార బీఆర్ఎస్ పార్టీకి కోవర్టుగా మారారని సికింద్రాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యుడు, ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్‌యాదవ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఎన్నికల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంజన్ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం 48 గంటలకు ముందే తాము ప్రచారం చేసే రూట్ మ్యాప్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికి చివరి నిమిషం వరకు అనుమతి ఇచ్చింది, లేనిది తెలియజేయడం లేదని ఆరోపించారు. ఏసీపీ యాదగిరి చర్యల వల్ల మంగళవారం రాంనగర్‌లో చేపట్టాల్సిన ప్రచారాన్ని చేపట్టలేకపోయామని, బుధవారం గాంధీనగర్‌లో నిర్వహించాల్సిన ప్రచారాన్ని కూడా నిర్వహించలేదని తెలిపారు. వాస్తవానికి బీఆర్ఎస్ ప్రచారానికి మా ప్రచారానికి ఎక్కడ కూడా రూట్ క్లాష్ కాకనప్పటికి ఏదో చిన్న చిన్న కారణాలతో తమ ప్రచారానికి అనుమతులను నిరాకరిస్తున్నారని విమర్శించారు. దీన్ని వల్ల తాము ముందస్తుగా తయారు చేసుకున్న వంటలు, ఇతర సామగ్రి వృధా కావాల్సి వస్తుందని తెలిపారు. దీన్ని వెనుక ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆయన కుమారుడు ముఠా జైసింహ హస్తం ఉందని ఆరోపించారు. చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి ముఠా గోపాల్‌కు బంధువు అని తెలిసిందని అందుకే ఆయన వారి అడుగులకు మడుగులు వత్తుతున్నారని ఘాటుగా విమర్శించారు.

నా నామినేషన్ పత్రాలను ఎలా పరిశీలిస్తారు?

నేను నామినేషన్ పత్రాలను దాఖలు చేసిన అనంతరం 13వ తేదీన పరిశీలించిన తరువాత ఆర్వో సరిగ్గా ఉన్నాయని చెప్పిన తరువాత ముఠా గోపాల్‌కు చెందిన వ్యక్తులు నా నామినేషన్ పత్రాలను ఎలా పరిశీలిస్తారని ఆయన ప్రశ్నించారు. దాని వెనుక కూడా ఏసీపీ ఉన్నారని ఆరోపించారు. నా నామినేషన్‌ను తిరస్కరించే విధంగా కుట్రలు చేశారని నా జీవితంతో చలగాటం ఆడడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించారు. ఏసీపీపై పోలీస్ ఉన్నతాధికారులకు, ఎలక్షన్ కమీషన్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు